క్లుప్తంగా

వలంటీర్ కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి మాన్యువల్ స్ట్రీట్‌లో నివాసం ఉంటున్న వలంటీర్ కొసన శ్రీనివాస్‌ను వైఎస్సార్‌సీపీ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ మంగళవారం పరామర్శించారు. శ్రీనివాస్ తల్లి లక్ష్మి మరణించారని తెలియడంతో వారి ఇంటికి వెళ్లి, దహన సంస్కారాల నిమిత్తం రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు. కొసన శ్రీనివాస్ సుబ్బలక్ష్మీనగర్‌లో వలంటీర్‌గా సేవలందిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ వి.వేళంగిణీరావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మన్యు సూక్త హోమం



దేవాలయంలో హోమం చేస్తున్న వేదపండితులు

మహారాణిపేట: మెయిన్‌రోడ్డులోని ఆంజనేయ స్వామి దేవాలయంలో ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం మన్యు సూక్త హోమం ఘనంగా నిర్వహించారు. ప్రతి నెలా పౌర్ణమి తిథినాడు ఆలయంలో ఈ హోమం నిర్వహిస్తున్నట్లు ఈవో అల్లు జగన్నాథం తెలిపారు. నరఘోష, శత్రుఘోష, రుణబాధ నివారణ, గ్రహ శాంతి, కార్యసిద్ధి కోసం ఈ హోమం చేయించుకుంటారని, 516 రూపాయలు చెల్లించిన వారు హోమంలో పాల్గొనవచ్చని తెలియజేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

9న గ్రూపు-2కు ఉచిత అవగాహన సదస్సు

అల్లిపురం: అల్లూరి స్టడీ సర్కిల్, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 9న ఉచిత గ్రూప్-2 అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.అభిమన్యు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు సెమినార్ నిర్వహించనున్నామని పేర్కొ న్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సెమినార్‌లో పాల్గొనేందుకు తమ పేర్లను shorturl.at/ikux9 లింక్ ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. పూర్తి సమాచారం కోసం 63009 09672, 80084 12798, 99660 52266 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలి



సదస్సులో పాల్గొన్న విద్యావేత్తలు

అల్లిపురం: విద్యాసంస్థల్లో ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కృషి చేయాలని వక్తలు పేర్కొన్నారు. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఆన్ న్యాక్ క్వాలిటీ బెంచ్ మార్క్స్ అనే అంశంపై ఏవీఎన్ కళాశాలలో మంగళవారం సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో డీన్ డాక్టర్ జి.శంకర నారాయణ, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ పి.కృష్ణకుమారి, సెయింట్ ఆన్స్ కాలేజ్ నుంచి వచ్చిన రిసోర్స్‌పర్సన్ ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి తదితరులు ప్రసంగించారు. ప్రమాణాల పెంపుతో పాటు సంస్థను అభివృద్ధి పథంవైపు నడిపేందుకు కృషి అవసరమన్నారు.

13 నుంచి పన్ను చెల్లించని వాహన తనిఖీలు

గోపాలపట్నం: జిల్లా వ్యాప్తంగా పన్నులు చెల్లించని వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామని ఉప రవాణా కమిషనర్ రాజారత్నం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఫోన్ల ద్వారా వాహన యజమానులకు సమాచారమిచ్చామని, ఈ నెల 11లోగా పన్నులు చెల్లించాలన్నారు. ఈనెల 13 నుంచి తనిఖీలు చేపడతామన్నారు.

పబ్లిక్ డిమాండ్

బోర్డును తొలగించండి



జోన్-5 కార్యాలయంలో ప్రమాదభరితంగా బోర్డులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం జోన్-5 కార్యాలయం ఆవరణలో బోర్డులు తదితర సామగ్రిని వేసి వదిలేశారు. దీంతో సౌకర్యం కేంద్రానికి వచ్చే వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. ఆవరణలోనే వాహనాలను పార్క్ చేస్తుండడంతో వినియోగదారులు, జోనల్ ఆఫీస్‌కు వచ్చే అర్జీదారులు నడవడానికి కష్టమవుతోంది. వీటిని తొలగించమని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. జోనల్ కమిషనర్ స్పందించాలి.

– ఎస్.ఆనందరావు, జ్ఞానాపురం



జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో పందుల సంచారం

పందుల బెడద

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి బాబుకాలనీ, జేఎన్ఎన్ఆర్‌యూఎం కాలనీ, సెబాస్టియన్ కాలనీ ప్రాంతాల్లో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రజారోగ్య శాఖ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. పందుల యజమానులతో నిత్యం సమస్యలు తలెత్తుతున్నాయి. పిల్లలు, వృద్ధులు తరచూ జ్వరాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పందుల సంచారం అరికట్టాలి.

– జి.రమాలక్ష్మి, బాబుకాలనీ, జ్ఞానాపురం

కొవ్వొత్తులతో మహిళల నిరసన

సీతమ్మధార : స్త్రీ, పురుషులకు రాజ్యాంగబద్ధంగా అన్ని రంగాల్లో సమాన హక్కులు కల్పించినా స్త్రీలు ఇంకా వెనుకబడే ఉన్నారని మహిళా చేతన ప్రధాన కార్యదర్శి కె.పద్మ అన్నారు. స్త్రీలు తమ చుట్టూ ఉన్న పురుషాధిపత్య చీకట్లను తొలగించాలని కోరుతూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ కుటుంబ హింస తీవ్రత పెరుగుతోందని, వరకట్న వేధింపులు, హత్యలు, ఆత్మహత్యలు, లైంగిక దాడులు, హింస, అవమానాలు, అసమానత అన్ని వైపులా స్త్రీలను చుట్టుముట్టాయని అన్నారు. ఈ తరుణంలో స్త్రీలపై హింసకు వ్యతిరేకంగా, మహిళా చట్టాల సమగ్ర అమలును డిమాండ్ చేస్తూ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా చేతన ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. హెచ్‌ఆర్ఎఫ్ ప్రతినిధి కె.అనూరాధ, సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థినులతో పాటు ప్రిన్సిపాల్ రామలక్ష్మి, ఎ.సత్యవతి, లావణ్య, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులను ప్రదర్శిస్తున్న మహిళాచేతన ప్రతినిధి పద్మ తదితరులు

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో పాల్గొన్న ఉభయదాతలు

అల్లిపురం: బురుజుపేట శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8గంటల వరకు నిర్వహించిన పూజలో 108 స్వర్ణ పుష్పాలతో అమ్మవారిని అర్చించారు. కనకమహాలక్ష్మి అమ్మవారికి లక్ష కుంకుమార్చన చేశారు. ఈ పూజలో పదివేల రూపాయలు చెల్లించిన నలుగురు దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి శ్రీచక్ర నవవరణార్చన లక్ష్మీ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆరుగురు ఉభయదాతలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం



పట్టభద్రులకు కరపత్రాలు అందిస్తున్న ఫాతిమారాణి



నేరెళ్లకోనేరు కాలనీలో సుధాకర్ తరఫున ప్రచారం చేస్తున్న ఎస్.కె.సలీం తదితరులు

కంచరపాలెం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా 41వ వార్డు జ్ఞానాపురం పరిధిలో బాబుకాలనీ, గెడ్డవీధి, మాన్యువల్‌స్ట్రీట్ ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ నాయకుడు యాండ్రపు నిఖిలేష్ రాజ్‌కుమార్, జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యురాలు యాండ్రపు ఫాతిమారాణి మంగళవారం ప్రచారం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయలని కోరారు. పార్టీ నాయకులు గవర రమణ, వంటాకుల ఆదిలక్ష్మి, గుజ్జల ప్రమీల, లంక ఆదిలక్ష్మి, సింహా సుజాత, పిల్లి గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

32వ వార్డులో..

అల్లిపురం: ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా 32వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్కే సలీం ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. చెరువుగట్టు, నేరెళ్లకోనేరు కాలనీ ప్రాంతాల్లో పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.రమేష్, నీలబాబు, సత్తిబాబు, అరుణ్, ఎల్లాజీ, రమణారెడ్డి, భవానీ రెడ్డి, అప్పారావు, శ్రీను, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ సమాజంలో క్రీడా పరికరాల పంపిణీ



బాలబాలికలతో పైడా కృష్ణప్రసాద్, రోటరీ క్లబ్ సభ్యులు

అల్లిపురం: రోటరీ క్లబ్ ఆఫ్ వైజాగ్ కపుల్స్ ఆధ్వర్యంలో మంగవారం సాయంత్రం డాబాగార్డెన్స్ ప్రేమ సమాజంలో అనాథ బాలబాలికలకు ప్రేమ సమాజం అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్ వివిధ క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీఎస్ కంచర్ల రాంప్రసాద్, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ సెభశేత్‌కుమార్, సెక్రటరీ బి.ఉషామాధవి, ప్రేమ సమాజం కార్యదర్శి కోన జగదీశ్వరరావు, పలువురు ప్రముఖులు, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు సత్కారం నేడు



సమావేశంలో మాట్లాడుతున్న హేమలత

మహారాణిపేట: మహిళా దినోత్సవం సందర్భంగా పలు విభాగాల్లో నిష్ణాతులైన మహిళలను ఈ నెల 8న వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో సన్మానించనున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర మహిళా వింగ్ అధ్యక్షురాలు డాక్టర్ జి.హేమలత తెలిపారు. జిల్లా పరిషత్ వద్ద ఉన్న అంకోసా ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అనకాపల్లి ఎంపీ బి.వి.సత్యవతి, ప్రముఖ గైనకాలజిస్ట్, రచయిత్రి డాక్టర్ ఎ.వి జయలక్ష్మి, విశ్రాంత డీఎంఈ డాక్టర్ ఆర్.శశిప్రభ, దేహదానంపై అవగాహన కల్పిస్తున్న గూడూరు సీతా మహాలక్ష్మి, లయన్స్ గవర్నర్ ఎం.ఉషారాజు, ప్రముఖ జర్నలిస్టు రాణి దేవళ్ల తదితరులను సత్కరించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమానికి ఏఎంసీ పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.సుధాకర్, విశ్రాంత ఐపీఎస్ అధికారి జె.డి.లక్ష్మీ నారాయణ తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరవుతారని తెలిపారు. సమావేశంలో ఐఎంఏ విశాఖ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పి.జె.శ్రీనివాస్, మహిళా వింగ్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పద్మావతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మర్యాద పూర్వక భేటీ



న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కృష్ణమోహన్

విశాఖ లీగల్: విశాఖపట్నం పోర్ట్ ఫోలియా జడ్జి జస్టిస్ యు.దుర్గా ప్రసాదరావును రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు ఎస్.కృష్ణమోహనరావు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందజేశారు.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి

విశాఖ విద్య: విద్యా ప్రమాణాలు పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో ఎల్.చంద్రకళ అన్నారు. మంగళవారం నగరంలోని సునీల్‌శర్మ కాలనీలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదో తరగతి విద్యార్థులతో కొద్ది సేపు మాట్లాడారు.

విద్యార్థుల ఇళ్ల సందర్శన

ఎండాడ, గొల్ల ఎండాడ కాలనీల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు రాత్రి డీఈవో వెళ్లి, వారు పరీక్షలకు ఎలా సిద్ధమౌతున్నది స్వయంగా పరిశీలించారు. పలు అంశాలపై ప్రశ్నించారు.

అన్ని వర్గాల అభ్యున్నతే సీఎం లక్ష్యం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్

> వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

బీచ్ రోడ్డు : రాష్ట్రంలోని అన్ని సామాజిక వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని ఒక హోటల్‌లో శ్రీ వేమన సంక్షేమ సంఘం, గోదావరి రెడ్డి కల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాలను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేశారన్నారు. రెడ్డి సామాజిక వర్గ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. విశాఖ పరిపాలన రాజధాని కానున్న తరుణంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో సుధాకర్‌ను గెలిపించి సీఎంకు బహుమతిగా ఇవ్వాలన్నారు. శ్రీ వేమన సంక్షేమ సంఘం అధ్యక్షుడు వివేకానంద రెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు సీతంరాజు సుధాకర్ గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి, కాయల వెంకటరెడ్డి, వీరరాఘవ రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిరండూల్ లైన్‌లో పలు రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): భద్రతా కారణాల వలన కిరండూల్‌లో లైన్‌లో నడిచే పలు రైళ్లు ఆయా తేదీలలో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. కిరండూల్‌లో బుధవారం బయల్దేరవలసిన కిరండూల్-విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ కిరండూల్ నుంచి కాకుండా దంతేవాడ నుండి బయల్దేరి విశాఖ చేరుకుంటుంది. విశాఖ బుధవారం బయల్దేరే విశాఖ- కిరండూల్ (08551) దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్‌లో బుధ,గురువారాల్లో బయల్దేరవలసిన కిరండూల్ - విశాఖ రైలు ఆయా తేదీలలో కిరండూల్ నుంచి కాకుండా దంతేవాడ నుంచి బయలేరి విశాఖ చేరుకుంటాయి.

గాయకులు సుశీల, ఉషా ఉతప్‌లకు పురస్కారాలు నేడు



సుశీలకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

మద్దిలపాలెం: స్థానిక కళాభారతి ఆడిటోరియం యాక్మీ ఆధ్వర్యంలో బుధవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించనున్నామని నిర్వాహకుడు ప్రతాప్ తెలిపారు. వేడుకల్లో భాగంగా గాయనీమణులు పి.సుశీల, ఉషాఉతప్‌కు 2023 ఔట్ స్టాండింగ్ ఇన్‌స్పిరేషన్ వుమెన్ పురస్కారాలతో సత్కరించనున్నామని పేర్కొన్నారు.

గాయని సుశీలకు స్వాగతం

గాయని సుశీల మంగళవారం విశాఖ చేరుకున్నారు. ఎయిర్‌పోర్టులో ఆమెకు యాక్మీ ప్రతినిధి ప్రతాప్, వండర్ కిడ్స్ స్కూల్ అధినేత రాముడునాయుడు స్వాగతం పలికారు.

జాతీయ రహదారిపై కారు బోల్తా



బోల్తా కొట్టిన కారు

ఎంవీపీ కాలనీ: సత్యం జంక్షన్ సమీపంలో ఓ కారు ఒక వ్యక్తిని ఢీకొని జాతీయ రహదారిపై బోల్తా కొట్టిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆరిలోవ బాలాజీనగర్‌కు చెందిన బోర శ్రీను(32) మంగళవారం తెల్లవారుజామున ఎన్ఏడీ వైపు నుంచి ఆరిలోవ వైపు జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్నారు. సత్యం కూడలి సమీప జయభేరి షోరూం ఎదురుగా వచ్చేసరికి అతివేగం కారణంగా వై.దాలినాయుడు అనే వ్యక్తిని ఢీకొట్టడంతో పాటు చెట్టును గుద్దుకోవడంతో ఒక్కసారిగా కారు అదుపు తప్పి బోల్తా కొట్టింది. స్థానికులు స్పందించి కారులోని వ్యక్తిని బయటకు తీసి, 108కి, పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనలో గాయపడిన దాలినాయుడిని చికిత్స నిమిత్తం ఎస్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం దాలినాయుడు అపస్మారక స్థితిలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

మేడ పైనుంచి పడి విద్యార్థిని మృతి



మృతురాలు దొడ్డి తనుశ్రీ

అల్లిపురం: ప్రమాదవశాత్తు అపార్ట్‌మెంట్ మొదటి అంతస్తు పైనుంచి పడి ఓ ఇంటర్ విద్యార్థిని మృతి చెందిన ఘటన టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. అస్పంగార్డెన్స్‌లో పోలీస్ క్వార్టర్స్ సమీప ఓ అపార్ట్‌మెంట్‌లో దొడ్డి తనుశ్రీ(17) తన కుటుంబంతో నివసిస్తోంది. సోమవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో స్నానం చేసేందుకు వెళ్తున్న ఆమె.. బాల్కనీలో ఆరబెట్టిన టవల్ తీసుకునేందుకు వంగి ప్రమాదవశాత్తు మొదటి అంతస్తు నుంచి జారి కింద పడిపోయింది. దీంతో ఆమె తలకు గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు తక్షణమే సెవెన్‌హిల్స్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తనుశ్రీ నారాయణ కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

మహిళా పోలీసులకు వైద్య పరీక్షలు

- ఉమెన్స్ డే సందర్భంగా ఉచిత వైద్య శిబిరం



పోలీస్ అధికారులు, సిబ్బందికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

దొండపర్తి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విశాఖ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పోలీస్ బ్యారెక్స్ వద్ద ఉన్న పోలీస్ కల్యాణమండపంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ సతీమణి విజయలక్ష్మి, డీసీపీ-1 సతీమణి కె.అనీషాగరుడ్, డీసీపీ-2 సతీమణి కె.లతారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే రీజనల్ పోలీస్ హాస్పిటల్ యూనిట్ మెడికల్ ఆఫీసర్ పి.పద్మజ, మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి డాక్టర్ డాక్టర్.సుభద్ర, అక్షయ హాస్పిటల్ డాక్టర్ గీతా శ్రీకాంత్, మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది వారి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ శిబిరంలో మహిళా పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు సుమారు 300 మంది వరకు క్యాన్సర్ సంబంధిత పరీక్షలతో పాటు గైనిక్, ఇతర పరీక్షలు చేయించుకున్నారు.

పాలనలో కాలనీ సంఘాలు భాగస్వాములు కావాలి

అల్లిపురం: జీవీఎంసీ పరిపాలన వ్యవస్థలో కాలనీ సంక్షేమ సంఘాలు భాగస్వాములు కావాలని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు అన్నారు. ఏపీ కాలనీ సంక్షేమ సంఘాల సమాఖ్యతో ఆయన మంగళవారం వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా కూర్మన్నపాలెం నుంచి మధురవాడ వరకు సుమారు 150 కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ వార్డు కమిటీలలో ప్రాతినిధ్యం ఇవ్వాలని, ఏపీ ఫెర్వాస్ జోనల్ కో ఆర్డినేటర్లను గవర్నింగ్ కౌన్సిల్‌లో సభ్యులుగా చేర్చాలని కోరారు. కాలనీల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలలో సంక్షేమ సంఘాల సలహాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనికి జీవీఎంసీ కమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఈ వెబినార్‌లో అదనపు కమిషనర్ వి.సన్యాసిరావు, ఏపీ ఫెర్వాస్ అధ్యక్షుడు ఉదయ్ శీర్లమే, సహాయ అధ్యక్షుడు డాక్టర్ కె.ఎస్.ఆర్.మూర్తి, సహాయ కార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్, జోనల్ కో ఆర్డినేటర్, అనేక సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమాజ ప్రగతిలో మహిళల పాత్ర ప్రశంసనీయం



కార్యక్రమంలో పాల్గొన్న సహజ యోగ రాష్ట్ర మహిళా విభాగం ప్రతినిధులు



అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొన్న మేయర్ హరి వెంకటకుమారి, తదితరులు

అల్లిపురం: సమాజ ప్రగతిలో మహిళల పాత్ర ప్రశంసనీయమని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జిల్లా పరిషత్ చైరపర్సన్ జె.సుభద్ర కొనియాడారు. డాబాగార్డెన్స్‌లోని వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో వారు మాట్లాడారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తున్నారన్నారు. వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి, బ్రహ్మకుమారీస్ ప్రతినిధి బీకే రామేశ్వరిలు పాల్గొని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో వివిధ రంగాలలో సేవలందిస్తున్న 32 మంది మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వీజేఎఫ్ కార్యదర్శి దాడి రవికుమార్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఆర్.నాగరాజు పట్నాయక్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ముందుగా స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మహిళా చైతన్యంతో నవ సమాజ స్థాపన

మహిళా చైతన్యంతోనే నవ సమాజ స్థాపన సాధ్యమని సహజ యోగ రాష్ట్ర మహిళా విభాగం ప్రతినిధులు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర మహిళా విభాగం ఆధ్వర్యంలో నగరంలోని పలు హైస్కూల్స్, కళాశాలల్లో మంగళవారం ప్రత్యేక సదస్సులు నిర్వహించారు. మహిళలు ఏ సమస్యను అయినా మొక్కవోని ధైర్యంతో ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌కు సత్కారం

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆడిటోరియంలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, ఎన్ఎస్ఎస్, గిగిల్స్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ హాస్పిటల్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, ఆర్‌జేడీ జోన్-1, డాక్టర్ ఎస్.శోభావాణిని ఘనంగా సత్కరించారు. అధ్యాపకులకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.



మహిళా కళాశాల ప్రి న్సిపాల్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

'వేదిక'పై వేడుక

- మూడు రోజుల్లో 400 ప్రదర్శనలు
- జీ-20 సదస్సు జరిగే వరకు వీకెండ్‌లో మాత్రమే ప్రదర్శన



అలరించిన నృత్యప్రదర్శన



పాట పాడుతున్న దివ్యాంగుడు

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): నగరవాసుల్లో ఉన్న ప్రతిభను చాటుకునేందుకు జీవీఎంసీ ఆధ్వర్యంలో 'వేదిక' ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆర్కే బీచ్ వేదికగా తమ టాలెంట్‌ను ప్రదర్శించే అవకాశం కల్పించింది. జీ-20 సదస్సు నేపథ్యంలో వినూత్నంగా ఈ కార్యక్రమాన్ని జీవీఎంసీ చేపట్టింది. మూడు రోజులుగా జరిగిన వైజాగ్ టాలెంట్ హంట్‌కు విశేష స్పందన లభించింది. 400లకుపైగా ప్రదర్శనలు జరిగాయి. ముగింపు రోజైన మంగళవారం దివ్యాంగులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఫ్లూట్, గిటార్ వంటి వాయిద్యాలు, పాటలు పాడుతూ ప్రతిభ చాటుకున్నారు.

ఇకపై ప్రతీ శని, ఆదివారాల్లో వేదిక

జీ-20 సదస్సు జరిగే వరకు ప్రతీ శని, ఆదివారాల్లో ఈ కార్యక్రమం ఆర్కేబీచ్ వద్ద నిర్వహించనున్నట్టు జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసినాయుడు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తమ పేర్లను నమోదు చేసుకొని ప్రదర్శన ఇవ్వవచ్చన్నారు.